# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




సంపుటి : 01 | సంచిక : 106 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 15 మార్చి 2026 | పేజీలు : 4




## సాగునీరు.. విద్యుత్ సరఫరాపై
# స్పెషల్ ఫోకస్

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు

**జనగామ, మన చౌరాస్తా :** సాగునీరు, విద్యుత్ సరఫరాపై అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలో పంటల పరిస్థితి, సాగునీటి అందుబాటు, విద్యుత్ సరఫరా అంశాలపై సంబంధిత అధికారుల తో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, ఎన్‌పీడీసీఎల్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి జిల్లాలో సాగులో ఉన్న పంటల స్థితిగతులను వివరంగా చర్చించారు. ఈ నేపథ్యం లో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు తగిన విధంగా సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి వనరులు, నీటి వినియోగ నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేసి అందించాలని, ఆయకట్టుల పరిధి, కాలువల సామర్థ్యం వంటి వివరాలను సమర్పించాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరంగా అందించాల్సిందిగా ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలన్నారు. రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు గాను అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, వారానికి రెండు రోజులు తప్పనిసరిగా సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, నీటిపారుదల ఎస్ఈ సీతారాం, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేవు

గ్యాస్ సరఫరాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దు, తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హెచ్చరించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, ఇతర సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరాపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా స్థాయి గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఈఎస్ఎంసీ) సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 12 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో లక్షా అరవై వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అనవసరంగా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ప్రజలెవరూ కూడా ఆందోళన చెందవద్దు అని, డిమాండ్ కు అనుగుణంగా గ్యాస్ లభ్యత ఉందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పౌర సరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద ఉన్న నిల్వలను గమనిస్తూ ఉండాలని, వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అంజన్న ఆశీర్వాద యాత్ర షురూ..

- కరీంనగర్ మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు యాత్ర
- స్థానిక కార్పోరేటర్లు, పదివేలమందితో నడక
- రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మన చౌరాస్తా :** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీ కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది.


## wanted
### విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# ఎంపీ వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు



**హైదరాబాద్, మన చౌరాస్తా :** ముఖ్యమంత్రి సలహాదారు, తాజాగా రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ను తెలంగాణ పర్యాటక సంస్థ ఒప్పందం మరియు బాహ్య సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. రాబోయే 2026-27 సంవత్సరపు రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో పర్యాటక శాఖకు కనీసం రెండు వేల కోట్ల రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించాలని రాజమౌళి కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచంలో అరుదుగా కనిపించే అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ అవి సరైన అభివృద్ధి లేక వెలుగులోకి రావడం లేదని తెలిపారు. గతంలో హరిత హోటళ్ల నిర్మాణం ద్వారా పర్యాటక రంగానికి కొంత ఊపిరి లభించిందని, కానీ ఆ తరువాత కొత్త హోటళ్ల నిర్మాణం జరగకపోవడంతో అభివృద్ధి మందగించిందని పేర్కొన్నారు. కొన్ని ముఖ్యమైన హోటళ్లను వ్యక్తిగత నిర్వహణకు అప్పగించడం వల్ల పర్యాటక శాఖ ఆదాయానికి నష్టం కలిగిందని అన్నారు. ప్రతి జిల్లాలో ఒక సాధారణ హోటల్ నిర్మించి, ఆ జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు చిన్న బస్సులను ఏర్పాటు చేస్తే పర్యాటకులకు సౌకర్యం కలుగుతుందని, శాఖకు ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు. అలాగే తిరుపతికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు గతంలో చేసిన విధంగానే కొనసాగిస్తే భక్తులకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా నాగార్జున సాగర్ , లక్నవరం లేకు , కరీంనగర్ ఆనకట్ట, సోమశీల, సిద్ధిపేట చిన్న ట్యాంకు బండ్, కోటి లింగాల వంటి జలాశయ ప్రాంతాల్లో కేరళ తరహాలో నీటిమీద తేలియాడే పడవలను ఏర్పాటు చేస్తే దేశ విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంకా వెలుగులోకి రాని పుణ్యక్షేత్రాలు, అడవులు, జలపాతాలు, కొండ ప్రాంతాల్లో విహార నడకలకు అనుకూలమైన ప్రదేశాలు తెలంగాణలో సమృద్ధిగా ఉన్నాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి మంచి పేరు రావడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా యాదాద్రి టెంపుల్ , వేములవాడ , కొండగట్టు తదితర ప్రాంతాల్లో ఉన్న హరిత హోటళ్లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక శాఖ ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి రాబోయే రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలో కనీసం రెండు వేల కోట్ల రూపాయలను కేటాయించాలని వేం నరేందర్ రెడ్డిని కోరినట్లు సబ్బు రాజమౌళి తెలిపారు.



# టెన్త్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** పదవ తరగతి పరీక్షల నిర్వహణ కు సంబందించి.. సెట్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి చీఫ్ సూపరింటెండెంట్లకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పలు సూచనలను తెలిపారు. అనంతరం సెయింట్ మేరీస్ స్కూల్ అలాగే ధర్మకంచలోని ZPHS స్కూల్ లో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు, బయటి వ్యక్తుల ప్రవేశంపై నిషేధం, సిసి టివి కెమెరాల ద్వారా పర్యవేక్షణ వంటి కఠిన చర్యలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, డెస్కులు, సరైన వెలుతురు ఉండేలా చూడాలని వేసవి తీవ్రత కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.



# గ్యాస్ యూనిట్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రవి

**కమలాపూర్, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఉన్న ఎల్పిజి గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎల్పిజి గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ కు సంబంధించిన రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. నిర్వహణకు సంబంధించిన పలు వివరాలను ప్లాంట్ అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ కొరత జిల్లాలో లేదని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న గృహ వినియోగదారులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని వినియోగదారులు ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, డిటి సదానందం, తదితరులు ఉన్నారు.

**ఎంజేపీ పాఠశాల తనిఖీ**

కమలాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్డు ను పరిశీలించి విద్యార్థులకు చేస్తున్న వంటలను గురించి అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంట గ్యాస్ నిల్వల గురించి ఆరా తీశారు. విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను పరిశీలించారు.

# కుమారుడిపై ప్రేమతో విగ్రహం ఏర్పాటు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** కన్న ప్రేమ వెల కట్టలేనిది.. బిడ్డ దూరమైన ఆ జ్ఞాపకాలను గుండెల్లో దాచుకుంటాం.. విగ్రహరూపంలో ఆ కుమారుని చూసుకుంటూ తమ బాధను ఓదార్పుగా మార్చుకుంటున్నారు ఆ కన్న తల్లిదండ్రులు. పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన శ్రీరామ్ వెంకన్న వెంకటలక్ష్మి దంపతుల రెండవ కుమారుడు శ్రీరామ్ సోమన్న ఏడాది క్రితం విద్యుత్ ప్రమాదంతో మరణించారు. తమ కళ్ళ ముందే తిరిగిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కన్న తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అయితే తన కొడుకు జ్ఞాపకాలను తమ కళ్ళ ముందే కదలాడాలని ఉద్దేశంతో కుమారుడి రూపంతో ఉన్న నిలువెత్తు విగ్రహాన్ని తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకున్నారు ఆ కన్న తల్లిదండ్రులు. తాజాగా నేడు సంవత్సరీకరణం కార్యక్రమం సందర్భంగా శ్రీరామ్ సోమన్న విగ్రహాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితుల మధ్య శనివారం స్థానిక పెద్ద వంగర గ్రామ సర్పంచ్ ముద్దసానీ పారిజాతా సురేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.





# టీఎస్జేయూ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులకు పరామర్శ

**భూపాలపల్లి, మన చౌరాస్తా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలకు కవరేజ్ నిమిత్తం వెళ్లిన టీఎస్ జేయూ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రమాదవశాత్తు లిఫ్టులో జరిగిన ఘటనలో జిల్లా ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ పావుశెట్టి శ్రీనివాస్, ఎన్టీవీ సీనియర్ రిపోర్టర్ ఎడ్ల సంతోష్ గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర నాయకత్వం శనివారం వారి వారి నివాసాల్లో వారిని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో టీఎస్ జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈద శ్రీనాథ్, స్థానిక యూనియన్ నాయకులు తదితరులు ఉన్నారు.



# చిన్నారినకి వినికిడి యంత్రం అందజేత



**జనగామ, మన చౌరాస్తా :** పుట్టుకతో చెవులు వినిపించగా మాటలు రాక బాధపడుతున్న 12 సంవత్సరాల హాసినికి అండగా నిలిచిన ఆసియా ఫౌండేషన్. జనగామ మండలం ఎల్లంలా గ్రామానికి చెందిన రేణుక నిరుపేద కుటుంబం. కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తూ తన కుమార్తెకు మెరుగైన వైద్యం చేయించ లేని పరిస్థితులలో ఆసియా ఫౌండేషన్ వారికి సంప్రదించాగా చెవి వినికిడి యంత్రాన్ని అందించి వారికి అండగా నిలిచారు. దీంతో హాసిని, వారి తల్లి ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనగామ ఆసియా ఫౌండేషన్ ప్రతినిధి మహమ్మద్ మొయినుద్దీన్, తౌకిర్, శృతి, శివ, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను గుర్తించాలి

## సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం మహ్మదపూర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అమరవీరుల స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి పేదల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతి రెడ్డి సహా మరో పది మంది పోరాట యోధుల త్యాగాలు అమూల్యమని అన్నారు. ఆ అమర వీరులు బలి అయిన ఘటనకు నేటితో 78 సంవత్సరాలు పూర్తయినా వారికి తగిన గుర్తింపు రాలేదని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అమరవీరుల త్యాగాలు సరైన స్థాయిలో గుర్తింపు పొందలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు తగిన గౌరవం కల్పించాలని, అమరుల స్మృతి వనం ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కోరారు. అనంతరం అనంత భూషణ గుట్టల వద్ద సమరయోధుల సమాధులకు, అలాగే మహ్మదపూర్ మాజీ సర్పంచ్ పిట్టల వెంకన్న సమాధి వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. సిపిఐ పోరాటాల వల్లే లక్షలాది ఎకరాల భూమి పేదలకు అందిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఎర్రజెండా నాయకులు వేర్వేరు పార్టీలుగా విడిపోవడం వల్ల పేదల సమస్యలు సరిగా పరిష్కారం కావడం లేదని, ఎడమపక్ష శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు సంక్షేమ పథకాల కోసం అడుక్కునే పరిస్థితి రావడం సరికాదని, అర్హులైన వారికి పింఛన్లు, పక్క ఇళ్లు, రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ నెలలో గడపగడపకు సిపిఐ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి పంజాల శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, అందే స్వామి, గడిపె మల్లేశ్, అందే అశోక్, తుల వాసంతి మధుసుధన్ రావు, తుల శ్రీదేవి సుధాకర్ రావు, జంగల్ కరుణ, అయిలేని సంజీవరెడ్డి, గూడ పద్మ, జనగాం రాజ్ కుమార్, పొదిల కుమార స్వామి, బత్తుల బాబు, బొనగిరి శంకర్, పిట్టల మెగిలయ్య, పిట్టల సుధాకర్, అయిలేని మల్లారెడ్డి, పిట్టల ప్రసాద్, మౌటం బాలయ్య, జంగ విజయ, దొంతరవేని రంజిత్, వెల్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ పట్టణంలోని అమరవీరుల భవన్ వద్ద అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



# జనగామ అమ్మ క్యాంటీన్ ఆధ్వర్యంలో హాస్పిటల్ వద్ద అన్నప్రసాద వితరణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామకు చెందిన దేవసాని జయ, రమేశ్ దంపతులు షష్టిపూర్తి పూర్తి చేసుకున్న సందర్భంగా వారి కుమారుడు దేవసాని రాజనర్సింహ మానవతా దృక్పథంతో జనగామ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. శనివారం జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవసాని జయ, రమేష్ వారి కుమారుడు రాజనర్సింహ, కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ టీం తరుపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, బల్ల శంకర్, ఏదునూరి శ్రీనివాస్, పండుగ నరేష్, బింగి నరసింహులు, ఎండి అఫ్రోజ్, ఎండి యాకూబ్, కొయ్యడ విశ్వ పాల్గొన్నారు.



# మన కృషి అగ్రి డ్రోన్ సెంటర్ ప్రారంభం

**యాదాద్రి, మన చౌరాస్తా :** యాదగిరిగుట్ట పట్టణంలో పాత గుట్ట రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన "మన కృషి అగ్రి డ్రోన్ సెంటర్" ను ప్రభుత్వ విప్ ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని తెలిపారు. అగ్రి డ్రోన్ల ద్వారా పంటలపై మందులు పిచికారీ చేయడం, ఎరువులు వేయడం, పంటల పరిస్థితిని పరిశీలించడం వంటి పనులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేయగలమని అన్నారు. దీని వల్ల రైతుల శ్రమ తగ్గడంతో పాటు దిగుబడులు పెరగడానికి కూడా సహాయపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం గ్రామీణ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం అగ్రి డ్రోన్ సెంటర్ నిర్వాహకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.





# గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు

**యాదాద్రి, మన చౌరాస్తా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం తోపుగని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువు నిండేలా చేసి ప్రజలకు, రైతులకు నీరు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగాని చెరువు



నిండడంతో పరిసర ప్రాంతాల చెరువులు కూడా నింపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యాదగిరిగుట్ట నుంచి వంగపల్లి, రామాజీపేట, తాళ్లగూడెం తదితరంగా 15కు పైగా గ్రామాలకు చెరువులు నింపి నీరు అందే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. చెరువులు నిండడంతో రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.

# మళ్లీ అనుష్క పెళ్లి ముచ్చట

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్నప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**